# ఆకలి కథ

వల్లేటి బాలాజీ



బాల్కనీలో చల్లటి గాలి వీస్తోంది. ఆ గాలి ఎటువంటి వాడి మననునైనా పులకరింపచేయాలి. కానీ నా మననుని మాత్రం పులకరింపజేయలేకపోతూంది. దాదాపు అర్థరాత్రి కావస్తోంది. మెత్తటి పరుపు మీద అటూ ఇటూ రెండు గంటల సేపటినుంచీ దొర్లుతూనే ఉన్నాను. ఎందుకో ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. కేవలం నిద్ర రాకపోవడమే అయితే వర్వాలేదు. కడుపంతా నొప్పిగా ఏదో వర్ణించ నలవి కాని బాధగా ఉంది.

"ఆ బాధకి కారణం?" అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

'పెద్ద కారణ మేముంటుంది, కేవలం రాత్రి పడుకునే ముందు భోజనం చేయకపోవడమే!' అన్న నమాధానం కూడా వెనువెంటనే గుర్తొచ్చింది.

భోజనం చేయకపోవడానికి మాత్రం, ఎంతో ప్రత్యేకమైన కారణం ఉంది.

ఆ ప్రత్యేక కారణం ఏమిటంటే భార్యామణితో గొడవ పడడమే!

భార్యామణిగారితో గొడవ పడడానికి మాత్రం ప్రత్యేక కారణాలేం లేవు. ఆఫీను నుండి వచ్చేటప్పుడు దారిలో మంచి ఇంగ్లీషు సినిమా పోస్టర్ చూశాను.

"నుగుణా! ఈ రోజు నైట్ షోకు వెళ్దామా?" ఇంటి కొచ్చిన తర్వాత ఆమె ఇచ్చిన టీ కప్పు చేతికి తీనుకుంటూ అడిగాను.

"ఈ రోజు నైట్ షోకి రాలేనండీ!" ఠకీమని నమాధానం మొహంమీద కొట్టినట్లు చెప్పింది.

"ఎందుకు రాలేవు?" నేనూ కొంచెం గట్టిగానే ప్రశ్నించాను.

"నేను సినిమాకు రాలేనంటే ఎందు కంత గట్టిగా అరుస్తారు?" తనూ గట్టిగానే అడిగింది నన్ను.

"మగాడ్ని నేను గట్టిగా అరుస్తాను! నువ్వూ అరవాలా?"

"ఏం నే నెందుకు అరవకూడదు?"

ఇలా దాదాపు మా ఇద్దరికీ అర గంటసేపు వాగ్యుద్ధం జరిగింది.

ఆ తర్వాత ఇంట్లో తుఫాను వెలసిన ప్రశాంతి!

ఇద్దరం గొడవ పడడం మూలాన సినిమాకు వెళ్లలేదు. అంతేకాదు. భోజనం కూడా చెయ్యలేదు ఇద్దరమూ!

ఆవిడగారు పడక గదిలో పడుకున్నారు. నేను పక్క తీనుకెళ్లి బాల్కనీలో వేనుకున్నాను. బాల్కనీలో ఎంతసేపు దొర్లుతున్నా నిద్ర రావడం లేదు.

"మహాత్మా! ముందు నన్ను శాంతపరుస్తావా? లేదా?" అని ప్రశ్నించాడు ఆత్మారాముడు.

బాత్రూంకి వెళ్లా లనిపించింది. బెడ్‌మీద నుంచి లేచాను. మెల్లగా నడవసాగాను. డైనింగ్ హాలు దగ్గరకు వెళ్లేనరికి నా కాళ్లు అనంకల్పితంగా ఆగిపోయాయి. కళ్లు ఆటోమాటిక్‌గా డైనింగ్ టేబుల్ వంక చూశాయి. ఎంతో నీట్‌గా నర్ది ఉంచిన ఆహార పదార్థాలు నా నోరు ఊరించాయి. కడుపులో ఆకలి నొప్పి ఎక్కువయ్యింది. కదలనన్న కాళ్లను ఎలాగో కదిలించి బాత్రూం దగ్గరకు వెళ్లాను.

బాత్రూం నుంచి తిరిగి వచ్చేటప్పుడు మాత్రం డైనింగ్ టేబుల్ వంక కన్నెత్తి కూడా చూడలేదు. అలా వాటివంక చూస్తే వాటిని తినాలన్న కోరికను అదుపు చేనుకోలేనేమో అన్న భయం నాలో ఉండబట్టే చూడలేదు.

బాల్కనీలోని బెడ్‌మీద మెల్లగా వాలాను. నిద్ర పట్టదని తెలును.

కడుపునొప్పి, ఆత్మారాముడి గోల రెండూ అధిక మయ్యాయి.

"బహుశా నుగుణ కూడా ఇలానే బాధపడుతుంటుందా?" అన్న ప్రశ్న నాలో ఉదయించడం - గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టడం ఒకేసారి జరిగింది.

"నే ననుకున్నది నత్యం! అందుకే గోడ గడియారం సాక్ష్యంగా మ్రోగింది" అనుకున్నాను.

పాపం నుగుణ నా అంత బాధ పడుతుందన్న

నిజం ఎందుకో చేదుగా అనిపించింది. అంత బాధపడే బదులు వచ్చి నన్ను పిలవొచ్చుగా?

"నువ్వే వెళ్లి పిలిచి నా బాధను చల్లార్చవచ్చుగా?" ఎదురు ప్రశ్నించాడు ఆత్మారాముడు.

"సర్లే నేనే వెళ్లి పిలుస్తా! ఆ మాత్రం సర్దుబాటు తప్పదుగా?" అనుకొని మెల్లగా లేచాను. భార్యామణి దగ్గరకు వెళ్లేముందు - "ఛ - మగాణ్ణి నే నేమిటి వెళ్లి భార్యను బ్రతిమాలడం?" అనుకున్నాను.

అంతే మళ్లీ బాల్కనీలోని బెడ్‌మీదకు వాలాను. మనస్సుని రకరకాల ఆలోచనలు చుట్టుముట్టాయి.

ఆలోచనలతో బెడ్‌మీద దొర్లుతున్న నా చెవికి గోడ గడియారం 'టంగ్' మన్న శబ్దం వినిపించింది.

"అమ్మో! పన్నెండున్నర అయ్యింది!" అనుకున్నాను.

కడుపులో ఆకలి బాధ ఓర్చుకోనంతగా పెరిగింది.

"మధ్యాహ్నం మామూలుగా తినే దానికంటే ఎక్కువే తిన్నాను. సాయంకాలం దార్లో లైట్ టిఫిన్ కూడా చేశాను. అయినా ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాను?"

"బహుశా నాకు ఏ ఉపవాసాలూ లాంటివి చేసే అలవాటు లేకపోవడం వల్లనేమో?"

నాకు తెలియకుండానే మెల్లగా బెడ్‌మీద నుండి లేచాను.

"వెళ్లి భార్యామణితో సర్దుకుందాం!" అనుకున్నాను మనస్సులో.

అయ్యో పాపం! సుగుణ కూడా నాలాగే ఆకలికి బాధపడ్తుందేమో అనుకొని మాత్రం ఆమెతో నేను సర్దుకోవడానికి సిద్ధపడలేదు. కేవలం నా ఆకలి బాధ తీర్చుకునేందుకే సర్దుకోవాలనుకుంటున్నాను. అనంకల్పింతంగా నా కాళ్లు బెడ్‌రూం దగ్గరకు వెళ్లాయి. బెడ్ దగ్గరకు వెళ్లబోయేటప్పుడు - "ఛ! మగాడ్ని నే నేమిటి వెళ్లి భార్యను బ్రతిమాలడం?" అనుకున్నాను మళ్లీ.

"పర్వాలేదులే, బెడ్ రూమేగా? ఎంత సర్దుకుపోయినా ఎవరు చూస్తారు? ఎంత దిగజారి సర్దుకున్నా ఎవరికీ తెలియదు!" అనుకోవడం నా కాళ్లు బెడ్ దగ్గరకు వెళ్లడం ఒకేసారి జరిగాయి.

మెల్లగా భార్యామణి ప్రక్కన కూర్చున్నాను.

అతి మెల్లగా ఆమెమీద చెయ్యి వేశాను.

చిరుకోపం ప్రదర్శించిం దామె.

అర్ధగంట సేపటిగానీ అర్ధాంగి పూర్తిగా సర్దుకోలేదు.

ఆ తర్వాత ఇద్దరం కలిసి భోజనాల గదికి వెళ్లాం.

డైనింగ్ టేబుల్ దగ్గర ఇద్దరం ఒకరికొకరు కొసరి కొసరి తినిపించుకున్నాం!

ఆ సమయంలో కూడా భుక్తాయాసం వచ్చే వరకూ తృప్తిగా తిన్నాను.

బాల్కనీ నుంచి నా పడక భార్య ప్రక్కకు మారింది.

* * * * *



## అరుదైన మక్షిక

*ప్రపంచంలో చాలా అరుదైన మక్షిక జాతి ఒకటి న్యూజిలాండులో కనుమరుగైపోతోంది. దీనికి గబ్బిలం రెక్కల వంటి పెద్ద రెక్క లుంటాయి. ఈ మక్షిక స్వజాతి భక్షణ కూడా చేస్తుంది.*

*ఈ కీటకం న్యూజిలాండ్ దక్షిణాన మారుమూల ప్రాంతమైన ఫియోర్ లాండ్ ప్రాంతంలో మాత్రమే ఈ శతాబ్దంలో మూడుసార్లు కనబడిందని డిపార్టుమెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ రిసెర్చ్‌కు చెందిన శాస్త్రవేత్త మైక్ మియార్క్స్ పేర్కొన్నారు.*

*ఈ మక్షిక జాతి జీవిత చక్రం కొంతే తెలియటం చేత ఇది తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఇది దాని పెద్ద రెక్కలతో సూర్యరశ్మినుంచి ఉష్ణం గ్రహించి శక్తివంతమై, ఇతర చిన్న కీటకాలను బలవంతంగా పట్టుకుంటుంది.*

*1901లో మిల్ఫర్డ్ సౌండ్ దగ్గర దీన్ని మొట్టమొదట కనుగొన్నారు. పది సంవత్సరాల తరువాత దీన్ని ఆహారం తింటుండగా చూశారు. దీనికి దొరికిన 'ఎర' శరీరంలోని ద్రవా లన్నిటినీ పీల్చివేస్తుంది. 1988లో దీన్ని ఆఖరిసారిగా చూశారు.*

సేకరణ: 'శంకర' [ఆచంట]

"సుగుణా! ఆఫీసుకి టైం అవుతుంది. అర్జెంట్‌గా టిఫిన్ పెట్టు." అన్నాను నేను.

"ఉదయం ఆలస్యంగా నిద్ర లేచానండీ! అందుకని.... టిఫిన్ చేయడానికి కుదరలేదండీ. ప్లీజ్ ఏమనుకోకండీ. మధ్యాహ్నం భోజనానికి కాస్త త్వరగా వచ్చేసేయండి. మీ కిష్టమైన గుత్తి వంకాయ కూర వండి పెడతాను." అని మెల్లగా ఓ ముద్దిచ్చింది.

అంతే, ఐస్ అయిపోయాను నేను.

స్కూటర్ మీద ఆఫీసుకు వెళ్తున్నా నా కంటికి ఉడిపి కృష్ణ హోటల్ కన్పించింది.

అంతే, నా కుడికాలు స్కూటర్ బ్రేక్‌ను మెల్లగా అదిమింది.

ఫలితం హోటల్ ముందు స్కూటర్ ఆగింది. ఓ ప్రక్కగా స్కూటర్ ఉంచాను.

హోటల్ లోపలకు అడుగు పెట్టగానే -

"హల్లో! ఏమిటి టిఫిన్ చేయడానికి వచ్చావా?" అంటూ నా కొలీగ్ కృష్ణమూర్తి ప్రశ్నించాడు.

"టిఫిన్ చేయడానికి కాక చూసి పోవడానికి వస్తానా? వెధవ ప్రశ్నా నువ్వూనూ!" అని మనస్సులో అనుకొని "అవునండీ!" అన్నాను మర్యాదగా.

ఎందుకంటే కృష్ణమూర్తి నాపై ఆఫీసరు. అతడితో నా కెన్నో పనులుంటాయి.

"నేనిప్పుడే టిఫిన్ చేశాను. కౌంటర్ దగ్గర కూర్చుని పేపర్ చదువుతుంటాను. మీరూ టిఫిన్ చేసిరండి. కలిసి మీ స్కూటర్ మీద ఆఫీసుకి వెళ్దాం!" అని నా సమాధానం కోసం ఎదురు చూడకుండా కౌంటర్ దగ్గరనున్న కుర్చీలో కూలబడ్డాడు కృష్ణమూర్తి.

"నిన్ను స్కూటర్‌లో ఆఫీసుకి తీసుకెళ్ళడం తప్పుతుందా మహాప్రభో! తుమ్మ బంకలాంటి వాడివి. తగులు కుంటే వదలవు" అనుకొని ఓ టేబుల్ దగ్గరకు వెళ్లి కూర్చున్నాను. నాలుగైదు రకాల టిఫిన్‌లు తృప్తిగా లాగించాను. ఆ తర్వాత స్ట్రాంగ్ కాఫీ ఓ కప్పు త్రాగి "బిల్లు పట్రా!" అన్నాను సర్వర్‌తో -

ఆ తర్వాత - "వెళ్దామా సార్?" అన్నాను పేరు చదవడంలో మునిగి ఉన్న కృష్ణమూర్తి గారితో -

"ఆ వెళ్దామోయ్!" అని తీరిగ్గా లేచాడు కృష్ణమూర్తి.

ఇద్దరం కలిసి మెల్లగా హోటల్ బయట పడ్డాము.

స్కూటర్ పార్కింగ్ దగ్గర నుంచి స్కూటర్ తీశాను.

స్కూటర్ స్టార్ట్ చేస్తున్న నన్ను....

"సార్! రెండు రోజుల నుంచి అన్నం లేదు. ఓ అర్ధ రూపాయి ఇస్తే టీ నీళ్లయినా తాగుతాను" అని అడిగాడో వ్యక్తి.

స్కూటర్ స్టార్ట్ చేయడం ఆపి ఆ అడిగిన వ్యక్తి వైపు చూశాను.

ఉందో లేదో అన్నట్లుందే పొట్ట. జీర్ణావస్థలో ఉన్న బట్టలతో తైలసంస్కారం లేని జుట్టుతో ఉన్నాడా వ్యక్తి.

" ఓ అర్ధ రూపాయి ఇద్దాంలే!" అని జేబులో చెయ్యిపెట్ట బోయాను.

అప్పుడు కృష్ణమూర్తి విసుక్కుంటూ అతడి వైపు చూస్తూ -

"వెళ్లవోయ్ వెళ్లు!" అని కసురుకున్నాడు.

కృష్ణమూర్తి కసురుడికి వెళ్లి పోయాడా వ్యక్తి.

"ఎందుకండీ వాడ్ని అలా కసరడం? పాపం వాడెంత ఆకలితో ఉన్నాడో?" అన్నాను నేను రాత్రి ఆకలి బాధను గుర్తు తెచ్చుకుంటూ.

నా మాటలు ఆ భిక్షగాడు విన్నాడు కాబోలు మెల్లగా వెనక్కు తిరిగి నా దగ్గరకు నడవసాగాడు.

"వాడికేం ఆకలండీ నా బొంద! నాలుగైదు రోజులు తిండి లేక పోయినా రెండు కప్పుల టీతో బ్రతికేయగలరలాంటి వెధవలు!" ఎంతో తాపీగా అన్నాడు కృష్ణమూర్తి.

"ఇహీ...హి...మరే!" అంటూ వెధవ నవ్వొకటి నవ్వేనే తప్ప

"ఆకలి బాధ నీకేం తెలుసురా ఇడియట్! రాత్రి నేనా బాధ స్వయంగా అనుభవించాను". అని కృష్ణమూర్తి నోరు మూయించి భిక్షగాడి చేతిలో ఓ పావలా బిళ్లయినా పెట్టే ధైర్యం చేయలేక పోయాను.

ముందు ముందు కృష్ణమూర్తితో ఏదైనా పని పడవచ్చు. అతను భిక్షం వేయకుండా నేను దాన కర్ణుడిలా పోజు పెట్టి భిక్షం వేస్తే అతడ్ని అవమాన పరచినట్లు ఉంటుంది. నేను భిక్షంగా వాడి చేతిలో పావలా ఉంచితే కృష్ణమూర్తి నొచ్చుకుంటాడన్న భయంతోటే నేను వాడి ఆకలి బాధను తెలుసుకొని కూడా టీకి డబ్బులివ్వలేక పోయాను.

"పాపం వాడికెంత ఆకలిగా ఉందో" అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేశాను.

○